దేవునిపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే నట్టేట మునిగినట్లేనని, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ అభివృద్ధిపై గొంతువిప్పి పోరాడుతారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇందిరానగర్, మహాదేవుపల్లి, దేవునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలవికాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు పూటకోమాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్, ఏప్రిల్ 23: కల్హేర్ మండలం మాసాన్‌పల్లికి చెందిన కర్వ రేణుక సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందడంతో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టపడి సంతోషంగా జీవనం గడుపుతున్న తరుణంలో రేణుక అకాల మృతి కుటుంబానికి తీరని లోటని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్, నాయకులు అంజయ్యసగర్, కృష్ణగౌడ్, అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, పండరి, పోచయ్య, గ్రామస్తులు ఉన్నారు.

పదేండ్ల అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్ 23: పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో హామీల అమలులో తేడాను చూసి ఓటెయ్యాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గొటిగార్‌పల్లి, పర్సపల్లి, కొత్తూర్, ఖానాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, అందరికీ రైతుబంధు, నిరంతర విద్యుత్, రైతులకు సరిపడా ఎరువులు అందించారని గుర్తు చేశారు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ అయినా నెరవేర్చిందా అని ప్రశ్నించారు. హామీల గురించి అడిగితే చెప్పులతో కొడతాం, పేగులు మెడలో వేసుకొంటం అని సమాధానమిస్తున్నారన్నారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు వచ్చారా లేకా ఇలాంటి పనులు చేసేందుకే అధికారంలోకి వచ్చారా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మధ్య తేడాను చూసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉద్యమకారుడిని గెలిపించండి

తెలంగాణ సాధనే లక్ష్యంగా 2001లో కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న గాలి అనిల్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలిస్తే జహీరాబాద్ ప్రాంతంలో సాగునీరు అందించే సంగమేశ్వర ఎత్తిపోతల పథకం, నిమ్జ్, తదితర ప్రజా సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తారన్నారు. తెలంగాణ బాగుపడాలంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎంపీలు ఎక్కువ మంది గెలువాలన్నారు. రాహుల్ గాంధీ, ప్రధాని మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. కానీ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, పంటలు ఎండిపోవడం కలిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ శ్రవంతిరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మ్యాథరి ఆనంద్, అక్షయ్ దేశ్‌పాండే, మొల్లయ్య, రామకృష్ణ, పిద్దప్ప, రాములు, నర్సింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడ్గి పాఠశాల నుంచి ఉపాధ్యాయులకు టాటా చెబుతూ ఇంటిబాట పట్టిన విద్యార్థులు

బడికి టాటా.. సెలవుల బాట!

- తల్లిదండ్రుల్లారా తస్మాత్ జాగ్రత్త
- జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం

న్యాల్‌కల్, ఏప్రిల్ 23: ప్రభుత్వం మంగళవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించింది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఉపాధ్యాయులకు టాటా చెబుతూ సంతోషంతో ఇంటికీ పరుగులు పెట్టారు. సెలవులను ఎంజాయ్ చేసేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. అమ్మమ్మలు, తాతయ్యల దగ్గరకు వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఆత్మీయులు, బంధువుల దగ్గర గడిపేందుకు పట్టణాల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు ప్రయా ణం కడుతున్నారు. అంతాబాగానే ఉన్నా విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎక్కడెక్కడికో వెళ్లి ఆటలాడుతుంటారు. బావులు, చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లేటప్పుడు పల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉండాల్సిన అవసరం ఉంది. ఎండలో ఆడేందుకు వెళ్తే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వేసవి సెలవుల్లో విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే కంప్యూటర్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, డ్యాన్స్, పాటలు తదితర రంగాల్లో శిక్షణ ఇప్పిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

హుస్సేల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 23: మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.1.02 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం.. బీదర్–జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ.1.02 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత సరైన పత్రాలు లేకపోవడంతో చెక్‌పోస్టు పోలీసులు నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

ఊరూవాడా ఆధ్యాత్మిక శోభ

పటాన్‌చెరు, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతిని జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. ఊరూ, వాడా శోభాయాత్రలు నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో నిర్వహించిన భారీ ర్యాలీ నిర్వహించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 23

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో హనుమాన్ జయంతి ర్యాలీలో పాల్గొన్న యువత

కొండాపూర్‌లో ఎంపీ బీబీ పాటిల్ పూజలు

పటాన్‌చెరు: ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అందోల్: జోగిపేటలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

రామచంద్రాపురం: పంచముఖి ఆలయంలో కలశ పూజ

జిన్నారం: హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో..

బొల్లారం: హనుమాన్ శోభాయాత్ర

నియామక పత్రం అందుకుంటున్న స్రవంతి రెడ్డి

మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా స్రవంతిరెడ్డి

బొల్లారం, ఏప్రిల్ 23: మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా బొల్లారం మున్సిపాలిటీకి చెందిన స్రవంతి రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మహిళా మోర్చా హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్, మెదక్ పార్లమెంట్ మహిళా మోర్చా ఇన్‌చార్జి దశరథలక్ష్మి, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు మాధురి ఆనంద్‌ల చేతుల మీదుగా స్రవంతిరెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. తన ఎన్నికకు సహకరించి, బాధ్యతలు అప్పగించిన నాయకులకు, కార్యకర్తలకు స్రవంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

హత్నూర, ఏప్రిల్ 23: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని హత్నూర మండలం సాదుల్లానగర్ శివారులోని రత్నపురి విద్యాసంస్థల ఏవో రఘు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు పాలిసెట్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 28వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రత్నపురి పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

విద్యార్థులతో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 23: విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదువుకోవాలని క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతికి చెందిన క్లాస్ టాపర్స్‌కి నగదు పురస్కారంతోపాటు ప్రసిద్ధ భారతీయ వ్యక్తులకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంప్రసాద్, క్లబ్ సభ్యులు వెంకటేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

సంగారెడ్డి, ఏప్రిల్ 23: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అడుగడుగునా చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించడం గొప్పవిషయమని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మంజీరానగర్‌లో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగభూషణం తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాయీబ్రహ్మణ సేవా సంఘం కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయీబ్రహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారాం, పట్టణ ప్రధాన కార్యదర్శి చేర్యాల ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు లక్ష్మయ్య, మురక్ష్మీరి, కోశాధికారి సత్తయ్య, విష్ణు, వీరేశం, యాదగిరి, వీరన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో యాన్యువల్ డే

పెద్దచెల్మడలో అంగన్‌వాడీలో చిన్నారులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

మునిపల్లి, ఏప్రిల్ 23: మండల పరిధిలోని పెద్దచెల్మడ, బుధేరా, తక్కడపల్లి, తాటిపల్లి, మొగ్డంపల్లి, బొడిశెట్‌పల్లి, మేళసంగం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం యాన్యువల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల నిండిన పిల్లలకు పట్టా సరిఫికెట్లు, ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి చిన్నారుల ఎదుగుదలను తల్లిదండ్రులకు వివరించారు. గ్రామాల్లో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించి చిన్నారుల ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

భక్తులకు అన్నదానం చేస్తున్న దాత ఆశోక్ దంపతులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 23: మండలంలోని మరియంపూర్ గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయం భక్తుల దర్శనలతో కిక్కిరిసిపోయింది. స్వామి వారి జాతరోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్వామి వారికి పాదపూజ, రుద్రాభిషేకం, అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం హారేమఠ్ పీఠాధిపతి డా.రాజశేఖర్, ఈదులపల్లి పీఠాధిపతి ఈశ్వరయ్యస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చాల్కి గ్రామానికి చెందిన అశోక్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం స్వామివారి రథోత్సం ఉంటుందని, కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నామని జాతర నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్ తెలిపారు.

కోర్టు స్టే ఇచ్చినా పనులు ఆపరా?

జిన్నారం, ఏప్రిల్ 23: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ సర్వేనంబర్ 27లో రైతులకు కేటాయించిన అసైన్డ్ భూములను ఏకపక్షంగా పరిశ్రమలకు కేటాయించారని, ముప్పై ఎకరాలకు సంబంధించి ఎనిమిది మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చిందని మాజీ ఉపసర్పంచ్ మమతాపెంటేశ్ మంగళవారం తెలిపారు. కోర్టు స్టే ఇచ్చిన తమ భూముల్లో సదరు వ్యక్తులు పనులు ఆపడం లేదని చెప్పారు. కోర్టు స్టే ఇచ్చిందని చెప్పినా పరిశ్రమల నిర్మాణాలనకు ప్రభుత్వం నుంచి తమకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, పత్రాలు మాత్రం చూపడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, కోర్టు స్టే ఆర్డర్ ప్రకారం పనులు నిలిపేయాలని కోరారు.

'ఓపెన్' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 23: జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో జరిగే వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ వరకు థియరీ పరీక్షలు, 3వ తేదీ నుంచి ప్రాక్టికల్ నిర్వహించనున్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని డీఈవో తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో మొత్తం 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలకు 2,388 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 4,297 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 452 మంది ఇన్విజిలేటర్లు, 25 మంది చొప్పున డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు విధులు నిర్వహించనున్నారు. జిల్లాలో ఆరు ప్రశ్నాపత్రాల స్టోరేజీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు డీఈవో తెలిపారు.

న్యాయమూర్తులకు ఘన సన్మానం

న్యాయమూర్తులను సాన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సంగారెడ్డి, ఏప్రిల్ 23: జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించి బదిలీ అయిన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, ప్రథమ శ్రేణి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సుదర్శన్‌ను బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులను సన్మానించి విడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సూర్‌రెడ్డి, అంబరీశ్, రమేశ్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీర మహేందర్, నిజామోద్దీన్, జ్ఞానోబా, పెంటయ్య, రమాదేవి, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

నియామకపత్రాలు అందిస్తున్న కాట సుధాశ్రీనివాస్ గౌడ్

అమీన్‌పూర్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ జిల్లా చేనేత విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంత్రి సుధాకర్, జాయింట్ సెక్రటరీగా పాతూరి పద్మ నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధాశ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఘనం గా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె వారికి నియామక పత్రా లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

కోహీర్, ఏప్రిల్ 23: ముగ్గురు ఆటో డ్రైవర్ల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన కోహీర్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ అన్వర్ అలీ(30), గురుజువాడ గ్రామానికి చెందిన మహ్మద్ కైఫ్, రాజనెల్లి గ్రామానికి చెందిన ముస్తకీమ్ ముగ్గురు స్నేహితులు. హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనోపాధి పొందేవారు. అన్వర్ అలీ వద్ద ఆటోలు రెంటుకు తీసుకొని నడిపేవారు. ముగ్గురు కలిసి దొంగతనాలు కూడా చేసేవారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కోహీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మద్యం తాగారు. అన్వర్‌కు ఇవ్వాల్సిన ఆటో రెంట్ డబ్బుల విషయంలో గొడవ చోటుచేసుకొంది. తనకు డబ్బులు ఇవ్వాలని షేక్ అన్వర్ అలీ ముందుగా వారిపై దాడికి దిగాడు. వెంటనే అప్రమత్తమైన మహ్మద్ కైఫ్, ముస్తకీమ్ కలిసి అన్వర్‌పై కత్తితో ప్రతీకార దాడి చేశారు. అన్వర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాలివాన బీభత్సం

ఎగిరిపడిన రైతు వేదిక రేకులు

కల్హేర్: గాలి బీభత్సానికి ఎగిరిపోయిన రైతువేదిక రేకులు

కల్హేర్, ఏప్రిల్ 23: ఈదురుగాలి బీభత్సవానికి కల్హేర్ మండలం మార్డి గ్రామంలోని రైతు వేదిక రేకులు వంద మీటర్ల దూరంలో ఎగిరి పడడంతో పాటు బాత్‌రూంపై ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు ఎగిరి కింద పడిపోయిందని ఏఈవో సతీశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం గాలికి ఎగిరిపోయిన రేకులను గ్రామ రైతులు తీసుకువచ్చి వేదికలో ఉంచారు. ఘటన తెలియగానే ఏఈవో వెంటనే అక్కడికి చేరుకొని నష్టపోయిన వివరాలను అధికారులకు విన్నవించారు.

బాజేపల్లిలో..

నిజాంపేట్, ఏప్రిల్ 23: నిజాంపేట్ మండల పరిధిలో సోమవారం సాయంత్రం గాలివాన బిభత్సవం సృష్టించింది. ఉరుములతో కూడిన గాలివానకు నిజాంపేట్ మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై టీన్‌లతో వేసిన పైకప్పు గాలికి కోట్టుకుపోయాయి. ఈ ఘటన రాత్రి జరగటంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. గత ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం కింద లక్షల రుపాయలు వెచ్చిస్తే కాంట్రాక్టర్ నామమాత్రపు పనులు చేసి పనులను మధ్యలోనే వదిలేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిజాంపేట్: గాలి వానకు పాఠశాలపై ఎగిరిపోయిన రేకుల పైకప్పు

వ్యక్తి అదృశ్యం

నక్కీర్తి ఈశ్వరయ్య

జిన్నారం, ఏప్రిల్ 23: నల్తూరు గ్రామానికి చెందిన నక్కీర్తి ఈశ్వరయ్య(55) కనిపించడం లేదని గ్రామ తాజామాజీ సర్పంచ్ నక్కీర్తి జనార్దన్ మంగళవారం తెలిపారు. ఈనెల 21 ఆదివారం ఉదయం 6గంటలకు ఇంట్లో నుంచి వెళ్లాడని, ఆధార్ కార్డు మినహా, మొబైల్, ఇతర గుర్తింపు కార్డులను ఇంట్లోనే వదిలేసి వెళ్లాడని పేర్కొన్నారు. బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 99515 05191, 97014 03573, 81850 08251 నంబర్లకు ఫోన్ చేయాలని, వారికి రూ.10 వేల బహుమానం అందజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

హోమం నిర్వహిస్తున్న ఈవో, భక్తులు

గుమ్మడిదల, ఏప్రిల్ 23: జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం మం డలంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఈవో శశిధర్‌గుప్తా ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. వేదపండితుడు లక్ష్మీనర్సింహమూర్తి, అర్చకబృందం చండీహోమం జరిపించారు. అనంతరం సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీంద్రమూర్తి, సోమయ్య పాల్గొన్నారు.